సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం ; 25 ; నవంబర్ ; 2023



ఏయూలో కింగ్ సందడి
ఆంధ్రయూనివర్సిటీలో కింగ్ నాగార్జున, అందాల యువ నటుడు అఖిల్ సందడి చేశారు.
10లో



రైతుల్లో ఆందోళన
అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గత నాలుగు రోజుల నుంచి వర్షం కురుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 10లో



బంతిపూల గౌరమ్మ 10లో
విశాఖ: అల్లిపురం వేంకటేశ్వరమెట్టపై గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా అమ్మ వారిని బంతిపూలతో అలంకరించారు.

న్యూస్‌రీల్

రాత పరీక్ష హాల్ టికెట్ల సిద్ధం
చింతూరు: సివిల్ సర్వీసెస్, గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలు పొందేందుకు ఉచిత శిక్షణ నిమిత్తం దరఖాస్తు చేసుకున్న గిరిజన అభ్యర్థులు మొదటిదశ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లు తీసుకోవాలని ఐటీడీఏ పీవో కావూరి చైతన్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాల్‌టికెట్లు చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, హాల్ టికెట్లు తీసుకున్న అభ్యర్థులకు ఈనెల 26న చింతూరులో మొదటిదశ పరీక్ష నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

'తాటిగుడ' వద్ద పర్యాటకుల సందడి


తాటిగుడ జలపాతం వ్యూపాయింట్ వద్ద ప్రకృతి అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

అనంతగిరి: మండలంలోని తాటిగుడ జలపాతం వద్ద శుక్రవారం పర్యాటకులు సందడి చేశారు. వర్షం అనంతరం సాయంత్రం పొగ మంచు అందాలు కనువిందు చేశాయి. మూడురోజులుగా ప్రాంతంలో సాయింత్రం దట్టంగా పొగమంచు కమ్ముకుంటోంది. ఘాట్‌రోడ్డులోని పొగమంచు కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు సాగిస్తున్నారు.

పనసపుట్టులో శిశువు మృతి


శిశువు మృతదేహం

హుకుంపేట: మండలంలోని పాతకోట పంచాయతీ పనసపుట్టులో గల్లుంగు సంజీవరావు, సన్నమ్మ దంపతులకు చెందిన రెండున్నర నెలల మగ శిశువు గురువారం అర్ధరాత్రి మృతి చెందింది. జలుబు, దగ్గు లక్షణాలతో చనిపోయినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

27 నుంచి సింహగిరిపై వరుణ జప హోమం
సింహాచలం : సింహగిరిపై త్రిపురాంతకస్వామి ఆలయంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు వరుణ జప హోమం నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి శుక్రవారం తెలిపారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న దృష్ట్యా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. దీనిలో భాగంగా 27 సాయంత్రం 5 గంటలకు జప సంకల్పం, రుత్విక్ వరణం, 28న గణపతి పూజ, పుణ్యాహవాచనం, మండపారాధన, కలశస్థాపన, రుద్రాభిషేకం, వరుణ జపం, 28 ఉదయం 11 గంటలకు సహస్ర ఘటాభిషేకం, 30 ఉదయం 10 గంటలకు మహా పూర్ణాహుతి, అగ్ని ప్రతిష్టాపన, జప హోమం, ప్రసాద వితరణ, అన్నసమారాధ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భక్తులంతా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాల్సిందిగా కోరారు.

పాడేరులో భారీ వర్షం


పాడేరులో కురుస్తున్న వర్షం

సాక్షి, పాడేరు: పాడేరు పట్టణం, సమీప ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి 10.30 గంటల నుంచి భారీ వర్షం కురుస్తోంది. రహదారులు జలమయమయ్యాయి. సాయంత్రం నుంచి చలిగాలులు వీస్తున్న సమయంలో ఆకస్మికంగా భారీ వర్షం కురవడంతో రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. పాడేరు పట్టణంతో పాటు ఘాట్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో విస్తారంగా వర్షం కురుస్తోంది.

నేడు ఎమ్మెల్యే పర్యటన
సాక్షి,పాడేరు: మండలంలోని గొండెలి, ఇరడాపల్లి పంచాయతీల్లో పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శనివారం ఉదయం పర్యటిస్తున్నారని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సిబ్బంది శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇరడాపల్లి, గొండెలి గ్రామాల్లో నిర్మించిన గ్రామ సచివాలయాల భవనాలను ఆమె ప్రారంభిస్తారని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవుల్లో ఉన్న నేతలు,స్థానిక ప్రజాప్రతినిధులు,పార్టీ నాయకులు,కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని వారు కోరారు.

మిలీనియం టవర్స్ @మినీ సెక్రటేరియట్

- రుషికొండలో సీఎం క్యాంపు కార్యాలయం
- పలు విభాగాల కార్యాలయాలకు భవనాల ఎంపిక
- పెందుర్తి నుంచి ఎండాడ వరకూ..
- కీలక విభాగాలకు భవనాల కేటాయింపు షురూ
- నీతిఆయోగ్ గ్రోత్‌హబ్‌గా ఎంపికైన విశాఖ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- సీఎం వైఎస్ జగన్ నిరంతర సమీక్షలు, క్షేత్రస్థాయి పర్యవేక్షణ
- రాష్ట్ర కమిటీ అందించిన నివేదిక ప్రకారం నిర్ణయం



పిఠాపురం కాలనీలో వీఎంఆర్‌డీఏ భవనం



మిలీనియం టవర్స్

మిలీనియం టవర్స్ కేంద్రంగా..
రుషికొండలోని ఐటీటవర్స్‌లో టవర్-బిని తూతూ మంత్రంగా నిర్మాణం చేసి టీడీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. ఈ బాధ్యతను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భుజానికెత్తుకుంది. టవర్-బీని పూర్తిస్థాయిలో నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రూ.65.12 కోట్లు ఖర్చవుతుందని ఏపీఐఐసీ అధికారులు నివేదిక అందించారు. 2020 నుంచి విడతల వారీగా నిధులు మంజూరు చేస్తూ మిలీనియం టవర్-బీని ప్రభుత్వం అభివృద్ధి చేసింది. మంత్రులు, సీనియర్ అధికారుల సమీక్ష సమావేశాలకు ఈ భవనాన్ని వినియోగించనున్నారు. సొంత భవనాల్లేని ప్రధాన శాఖలకు కూడా ఈ భవనాన్ని కేటాయించనున్నారు. ప్రస్తుతం మిలీనియం టవర్-ఏ,బీల్లో 1.75 లక్షల చ.అడుగుల విస్తీర్ణం ఖాళీగా ఉంది. వీటన్నింటిలో పలు శాఖలు సర్దుబాటు కానున్నాయి.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

నీతి ఆయోగ్ గ్రోత్ హబ్‌లో చోటు దక్కించుకున్న విశాఖ కేంద్రంగా అధికార కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. మిలీనియం టవర్స్ ఇక నుంచి మినీ సెక్రటేరియట్‌గా సేవలందించనుంది. రుషికొండలోని టూరిజం ప్రాజెక్టు ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంగా మారనున్నట్టు తెలుస్తోంది. అటు పెందుర్తి నుంచి ఇటు ఎండాడ వరకూ వివిధ రాష్ట్ర స్థాయి కార్యాలయాలు ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం సీఎం సమీక్షకు కేంద్రంగా మారనున్నాయి. వాస్తవానికి నవ్యాంధ్రలోని నగరాలతో పోలిస్తే.. విశాఖ విశాలమైన, ప్లాన్డ్ సిటీగా దేశ విదేశీ ప్రముఖులు సైతం కొనియాడారు. భిన్న వాతావరణం, విభిన్న సంస్కృతులు, మెచ్చే భాషలు, ఆది నుంచి దూసుకుపోతున్న రియల్ రంగం, అందుబాటులో మౌలిక వసతులు.. వెరసి దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు విశాఖ వైపు చూసేలా చేస్తున్నాయి. అందుకే నీతీ ఆయోగ్ గ్రోత్ హబ్స్ ఫస్ట్ ఫేజ్‌లో విశాఖ నగరం చోటు దక్కించుకుంది. అభివృద్ధికి కేంద్రంగా రాబోయే నాలుగైదేళ్లలో హైదరాబాద్‌కు దీటుగా ఎదిగేలా విశాఖ నగరం దూసుకుపోయేందుకు ఉన్న అభివృద్ధి అవకాశాల్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించేందుకు స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బృందం.. విశాఖ నుంచి పరిపాలన సాగించేందుకు సిద్ధమవుతోంది. ఆర్థిక వృద్ధికి రోడ్‌మ్యాప్ సిద్ధం చేసేందుకు ఏర్పాటు చేసిన జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీల అందించిన నివేదిక ప్రకారం సీఎం పరిపాలన కార్యాలయంతో పాటు కీలక శాఖలకు క్యాంపు కార్యాలయాల్ని గుర్తించారు.

ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధే ధ్యేయంగా..
దశాబ్దాలుగా వెనకబాటుతనానికి గురై అభివృద్ధికి నోచుకోని ఉత్తరాంధ్ర జిల్లాల్లో వెలుగులు నింపేందుకు వైఎస్ జగన్ సీఎంగా ప్రమాణస్వీకారం చేపట్టినప్పటినుంచి ప్రత్యేక ప్రణాళికలను అమలు చేస్తున్నారు. నీతి ఆయోగ్ గ్రోత్‌హబ్ జాబితాలో విశాఖ ఎంపిక కావడంతో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారు. అందుకే దీనికి సంబంధించిన అంశాలను స్వయంగా విశాఖ నుంచే సమీక్షించాలని నిర్ణయించారు. ఈ మేరకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి సీఎం క్యాంపు కార్యాలయంతో పాటు ఇతర శాఖల క్యాంపు కార్యాలయాలకు సంబంధించిన భవనాల ఎంపికపై కసరత్తు చేశారు. కేవలం విశాఖ మాత్రమే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాలన్నీ సమతులాభివృద్ధి చెందేలా క్షేత్ర స్థాయిలో సమీక్షల్ని సీఎం వైఎస్ జగన్ విశాఖ నుంచి నిర్వహించనున్నారు.

గ్రోత్ హబ్ దిశగా..
రెండేళ్ల క్రితం నీతి ఆయోగ్ ప్రకటించిన పట్టణ సుస్థిర అభివృద్ధి సూచికలో రెండు తెలుగు రాష్ట్రాల్లో మొదటి ర్యాంకును, జాతీయ స్థాయిలో 18వ ర్యాంకును సాధించిన నేపథ్యంలో.. విశాఖ నగరాన్ని గ్రోత్‌హబ్ పైలట్ సిటీగా ఎంపిక చేశారు. సహజ వనరులతో పాటు రైల్వే కనెక్టవిటీ, పోర్టు కనెక్టవిటీతో పాటు రాబోయే రోజుల్లో అంతర్జాతీయ విమానాశ్రయం కూడా రాబోతున్న నేపథ్యంలో గ్రోత్ హబ్‌గా ఎంపికైన విశాఖ అభివృద్ధి పథంలో దూసుకుపోనుంది. ఈ తరుణంలో విజన్ ఫర్ వైజాగ్ సిటీ పేరుతో దీనికి సంబంధించిన ఆర్థిక, అభివృద్ధి ప్రణాళికలపై నీతి ఆయోగ్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఇక్కడ చేపట్టాల్సిన అభివృద్ధి, అవకాశాలపై నిరంతరం అధ్యయనం చేసేందుకు స్వయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విశాఖ నుంచి పరిపాలన సాగించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే.. సీఎం క్యాంపు కార్యాలయంతో పాటు ఇతర శాఖల ముఖ్య అధికారుల క్యాంపు కార్యాలయాలకు భవనాలను ఎంపిక చేశారు.



వీఎంఆర్‌డీఏ భవనం

ఏ శాఖ కార్యాలయం ఎక్కడంటే...!
నగరంలోని వివిధ ప్రభుత్వ భవనాల్లో మొత్తం 2,27,287 చ.అడుగులు గుర్తించి ఆయా శాఖలకు కేటాయించారు. మొత్తం 35 శాఖలుండగా.. వీటిలో ఇప్పటి వరకూ 16 శాఖలకు భవనాలను గుర్తించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఉన్నతాధికారులు అందుబాటులో ఉండేలా భవనాల్ని ఎంపిక చేశారు. పెందుర్తి, మద్రిపాలెం, కంచరపాలెం, రామ్‌నగర్, మహరాణిపేట, మద్దిలపాలెం, ఆంధ్ర విశ్వవిద్యాలయం, సిరిపురం, దుర్గానగర్, ఎంవీపీ మిగతా 10వ పేజీలో ▶

ఘనంగా క్షీరాభిషేక సేవ


క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ (విశాఖ) : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

వరి నూర్పిడి యంత్రాలకు డిమాండ్


పాడేరు మండలం కుంచాపల్లిలో యంత్రాలతో వరి నూర్పులు

సాక్షి,పాడేరు: అల్పపీడనం నేపథ్యంలో రైతులు వరి నూర్పులపై దృష్టి సారించారు. త్వరితగతిన పూర్తిచేసేందుకు నూర్పిడి యంత్రాలను వినియోగిస్తున్నారు. గంటకు రూ.వెయ్యి చొప్పున యంత్రం యజమానులు అద్దె తీసుకుంటున్నారు. గంటలకు 30 బస్తాల మేర ధాన్యం నూర్పిడి అవుతోంది.చింతపల్లి, కొయ్యూరు, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట మండలాల్లోని యంత్రాలకు మంచి డిమాండ్ నెలకొంది.

చట్టాలు, హక్కులపై అవగాహన అవసరం

- పాడేరు కోర్టు న్యాయమూర్తి శివశంకర నారాయణ
- లింగాపుట్టులో న్యాయవిజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న పాడేరు కోర్టు న్యాయమూర్తి శివశంకర నారాయణ

సాక్షి,పాడేరు: అన్ని వర్గాల గిరిజనులు భారత రాజ్యాంగంలోని కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన పొందాలని పాడేరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ కోర్టు న్యాయమూర్తి శివశంకర నారాయణ కోరారు. గొండెలి పంచాయతీ లింగాపుట్టు గ్రామంలో శుక్రవారం గిరిజనులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులంతా ప్రభుత్వాలు కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంఘ విద్రోహక శక్తులకు దూరంగా ఉండాలన్నారు. యువత కూడా మంచి మార్గంలో నడవాలని సూచించారు. గిరిజనులంతా తమ పిల్లలను బాగా చదివించాలని,ఉన్నత విద్య,ఉద్యోగ లక్ష్యంతో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. బాల్య వివాహాలను కూడా అరికట్టాలని ఆడపిల్లలను బాగా చదివించాలన్నారు.న్యాయవ్యవస్థలో చట్టాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. గ్రామంలోని సమస్యలు తెలుసుకున్నారు. రోడ్డు అభివృద్ధితో రవాణా సౌకర్యాలు అందుబాటులోకి తేవాలని, తాగునీటి సదుపాయాలు కల్పించాలని గిరిజనులు న్యాయమూర్తికి విన్నవించారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని న్యాయమూర్తి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ లక్ష్మణ్, ఆర్‌అండ్‌బీ జేఈఈ నాగేంద్ర, పలువురు న్యాయవాదులు, గిరిజనులు పాల్గొన్నారు.

విశేషంగా నృత్య ప్రదర్శన
సింహాచలం: సింహగిరిపై శుక్రవారం జరిగిన నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి రాజగోపురం పక్కన ఉన్న కళావేదికపై సుమారు 30 మంది నృత్య కళాకారులు నృత్యప్రదర్శనలు చేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



నృత్యకళాకారులతో ఈవో

రైతులకు అండగా ప్రభుత్వం

- పంట నష్ట పరిహారం పంపిణీకి చర్యలు
- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, పక్కన సలహామండలి జిల్లా అధ్యక్షురాలు సరస్వతి

సాక్షి, పాడేరు: రైతులకు ప్రభుత్వం అన్నివిధాలా అండగా నిలుస్తుందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యానవన, ప్రకృతి వ్యవసాయ, పశుసంవర్ధకశాఖతో పాటు అనుబంధ విభాగాలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఎమ్మె ల్యే మాట్లాడుతూ ఈఏడాది పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు దృష్ట్యా పంట నష్టం జరిగిందని రైతులు చెబుతున్నారన్నారు. దీనిపై అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదిక పంపి పంట నష్ట పరిహారం పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం ఎంతో మంచి ఆశయంతో గిరిజన రైతులకు 90శాతం రాయితీపై రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేసిందన్నారు. ప్రకృతి సహకరించకపోవడంతో పంటకు నష్టం వాటిల్లడం బాధాకరమన్నారు.ఈ-క్రాప్ నమోదు పక్కాగా చేపట్టి రైతులకు మేలు చేయాలని సూచించారు. అర్హులైన రైతులకు పంట నష్టపరిహారం, రైతు భరోసా, పీఎం కిసాన్ ఆర్థిక ప్రోత్సాహకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నా రు. ఈఏడాది వరితో పాటు రాగులకు ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. రాగులను కిలో రూ. 38.46కు రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయడంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం చేసి బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షురాలు ఎం.సరస్వతి మాట్లాడుతూ గిరిజన రైతులకు ప్రభుత్వం అందిస్తున్న వ్యవసాయ ఉపకరణాల వివరాలను ఆర్‌బీకేల్లో ప్రచురించాలని సూచించారు. కాఫీ రైతులకు మిరియం నర్సరీలపై శిక్షణ ఇవ్వాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్.నందు,జిల్లా ఉద్యానవన అధికారి పి.రమేష్‌కుమార్‌రావు, పశుసంవర్ధకశాఖ ఏడీ నరసింహులు, పలుశాఖల అధికారులు రహీం, మురళీ, గణేష్, నాగసాయి, అన్ని మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ప్రాధాన్యం



పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



రైతులకు పట్టాలు పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి
- 83 మందికి డి.పట్టాల పంపిణీ

గూడెంకొత్తవీధి: గిరిజనుల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు.శుక్రవారం ఆమె మొండిగెడ్డ సచివాలయం వద్ద 83 మందికి 98 ఎకరాలకు సంబంధించి డి.పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్థిక సాధికారితతోనే గిరిజనుల జీవితాల్లో మార్పులు సాధ్యమన్నారు. పట్టాదారులకు రైతు భరోసా వర్తిస్తుందన్నారు. మరో 225 ఆర్వోఎఫ్‌ఆర్ పట్టాలు ఇస్తామన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పట్టాల పంపిణీ జరిగిందన్నారు. రైతుల మధ్య సరిహద్దు, భూ సమస్యలు ఉంటే నేరుగా అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోయిన కుమారి, జెడ్పీటీసీ కిముడు శివరత్నం, పార్టీ మండల అధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్ అడపా ప్రియాంక, వైస్ ఎంపీపీలు ఆనంద్, దేముడు, మత్స్యరాజు, మండల ప్రధాన కార్యదర్శి జోరంగి ప్రసాద్, యూత్ అధ్యక్షులు వంతల అరుణ్, సర్పంచ్‌లు కుందేరి రామకృష్ణ, కంకిపాటి రవీంద్ర ప్రసాద్,బి.లక్ష్మణ్, ఎంపీటీసీలు మొట్టడం సత్యనారాయణ, నాగమణి, అడపా లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో 98 మందికి హక్కు పత్రాలు..
ముంచంగిపుట్టు: తమది రైతుల ప్రభుత్వమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వైఎస్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 98 మంది శాశ్వత భూ హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో రైతుల భూములకు భూ రీసర్వే నిర్వహిస్తున్నారని అన్నారు. మొదటి విడతలో సర్వే పూర్తయిన గ్రామాల రైతులకు రూపాయి ఖర్చు లేకుండా పట్టాలు అందించడం జరుగుతుందని అన్నారు. జగనన్న తీసుకున్న నిర్ణయం వల్ల గిరిజన ప్రాంత రైతులకు భూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ, తహసీల్దార్ నర్సమ్మ,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు వెంగడ రమేష్,ఆర్ఐ వెంగడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ మండల నేతలు జయదేవ్, రామ్మూర్తి,శంకర్‌రావు, తిరుపతి,బాబూరావు,వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో క్షీరాబ్ది ద్వాదశి పూజలు


చిలుకు ద్వాదశి పర్వదినం జరుపుకుంటున్న గృహిణి

రాజవొమ్మంగి: క్షీరాబ్ది ద్వాదశి పూజలను మహిళలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తులసి మొక్కను లక్ష్మీదేవిగా, ఉసిరి చెట్టును శ్రీమన్నారాయణునిగాను భావించి పూజలు చేశారు. తులసిమొక్కల చుట్టూ దీపాలతో అలంకరించారు.



రాజవొమ్మంగిలో చిలుకు ద్వాదశి పూజలు జరుపుకుంటున్న ముత్తయిదువులు

పశువైద్య సిబ్బంది సాహసం



గ్రామంలో పశువైద్యసేవలను అందిస్తున్న పశువైద్యాధికారి, సిబ్బంది

- నాటు పడవపై వెళ్లి వైద్యం
- పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు సేవలు ప్రశంసనీయం

అనంతగిరి: మండలంలోని పినకోట పంచాయతీ కొత్తబూరు గ్రామానికి పశువైద్య సిబ్బంది నాటు పడవపై వెళ్లి పశువైద్యసేవలను అందించారు.. గ్రామానికి రహదారి సౌకర్యం లేదు. వెళ్లాలంటే ఒక్కటే మార్గం.. రైవాడ జలాశయం నాటుపడవపై ప్రయాణించాలి.. వర్షాల కారణంగా పశువులు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శుక్రవారం కాశీపట్నం పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు, తన సిబ్బందితో కలిసి రైవాడ నాటుపడవపై సాహస ప్రయాణం చేసి, గ్రామానికి చేరుకున్నారు. 165 మేకలకు పారుడు వ్యాధి నిరోధక టీకాలు, నట్టలు వ్యాక్సిన్ వేశారు. 112 పశువులకు జబ్బా వాపు నిరోధక టీకాలను వేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువైద్యాధికారి సాగిరి గణేశ్వరరావు గిరిజనులకు అవగాహన కల్పించారు. పశువులకు సోకే వ్యాధులను అప్రమత్తంగా వ్యవహరించాలని, వెనువెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. పశువైద్య సిబ్బంది సేవలను పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలోని పినకోట జూనియర్ వెటర్నరీ అధికారి సుధావాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రైవాడ జలాశయంలో నాటుపడవపై ప్రయాణిస్తున్న పశువైద్యాధికారి గణేశ్వరరావు, సిబ్బంది

క్లుప్తంగా

గన్నవరంలో చోరీ

ఎటపాక: మండల పరిధిలోని గన్నవరం గ్రామంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన ఆకుల దయాకర్ తన ట్రాక్టర్‌ను ఇంటి ముందు నిలిపి ఉంచారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్ బ్యాటరీని దొంగిలించారు. అదే విధంగా అదే వీధిలోని బండ్ల మల్లికార్జునరావుకి చెందిన హీరో హోండా బైక్‌ని కూడా చోరీ చేశారు. ముందురోజే తోటపల్లిలో మూడు ట్రాక్టర్ల బ్యాటరీల దొంగతనం మరువకముందే మరలా చోరీ జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. వరుస చోరీలకు పాల్పడే వారిని గుర్తించేందుకు ఎస్‌ఐ పార్థసారథి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి విచారణ జరుపుతున్నారు.

మద్యానికి డబ్బులివ్వలేదని యువకుడి ఆత్మహత్య


మంగళ మృతదేహం

సీలేరు: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం సీలేరులోని చోటు చేసుకుంది. ఎస్‌ఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. సీలేరు సమీప టీఆర్‌సీ క్యాంప్‌లో నివాసముంటున్న మంగళ(20) మద్యానికి బానిసయ్యాడు. శుక్రవారం తన తల్లిదండ్రులను మద్యం తాగేందుకు డబ్బులు అడగ్గా, వారు ఇవ్వకపోవడంతో ఇంట్లో పాయిజన్ తాగి, అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు గుర్తించి వెంటనే సీలేరు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్య సేవలు నిమిత్తం చింతపల్లి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లుగా ఎస్‌ఐ తెలిపారు. దీనిపై 174 సెక్షన్ కింద కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మిలీనియం టవర్స్ @ మినీ సెక్రటేరియట్

9వ పేజీ తరువాయి

కాలనీ, దయాళ్‌నగర్, హనుమంతువాక, ఎండాడ, భీమిలి వరకూ ఉన్న ప్రభుత్వ భవనాలను కేటాయించారు. మిగిలిన 19 శాఖలకు భవనాల గుర్తింపు ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఏఏ శాఖలు ఎక్కడ రానున్నాయంటే...

◆ ఎండాడలోని ఎన్‌వీపీ లా కళాశాల రహదారిలో వ్యవసాయ, సహకార శాఖ కార్యాలయం రానుంది. ఇక్కడ ఉన్న వ్యవసాయ శాఖ జేడీ కార్యాలయం, రీజినల్ కోడింగ్ సెంటర్ ల్యాబ్‌లను వ్యవసాయ శాఖ ప్రధాన కార్యాలయంగా ఎంపిక చేశారు. ఈ రెండు భవనాలు 3 వేల చ.అడుగులు విస్తీర్ణంలో ఉన్నాయి. అదేవిధంగా కోఆపరేటివ్ శాఖ కార్యాలయంగా మద్రిపాలెంలో 4 అంతస్తుల్లో 20 వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఆప్కాబ్ రిజర్వుడ్ భవనాన్ని గుర్తించారు.

◆ పశుసంవర్థక, మత్స్యశాఖ కార్యాలయాలను కూడా ఎంపిక చేశారు. వీటికోసం హనుమంతువాకలో 2 వేల చ.అడుగుల విస్తీర్ణంలో ఉన్న పశుసంవర్థక శాఖ కార్యాలయం, ఆదర్శనగర్‌లోని రీజినల్ ట్రైనింగ్ కేంద్రాన్ని గుర్తించారు.

◆ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఈఎఫ్ఎస్ అండ్ టీ) దయాల్‌నగర్ కాలనీలో డా.ఎన్టీఆర్ రోడ్ బీచ్‌రోడ్‌లో ఉన్న ఫారెస్ట్ గెస్ట్ హౌస్‌ని ఎంపిక చేశారు. 13 వేల చ.అడుగుల విస్తీర్ణం ఉన్న ఈ భవనంలో ఉన్న నాలుగు గదులను ఉన్నతాధికారుల నివాసానికి వినియోగించనున్నారు.

◆ వైద్యారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ ప్రధాన కార్యాలయాలు, ఉన్నతాధికారుల నివాసాలకు విమ్స్‌లో ఉన్న కొన్ని భవనాలను కేటాయించారు. 4 వేల చ.అడుగులున్న రీజినల్ డ్రగ్ స్టోర్, 8 వేల చ.అ. ఉన్న జాయింట్ డ్రగ్ కంట్రోల్ ఆఫీస్‌తో పాటు డీఎంహెచ్‌వో కార్యాలయం సమీపంలో ఉన్న కొన్ని పాత భవనాలను ఆధునికీకరించి వినియోగించనున్నారు. అదేవిధంగా ఉన్నతాధికారుల నివాస ప్రాంతంగా విమ్స్‌లో ఉన్న కొన్ని స్పెషల్ రూమ్స్‌ను గుర్తించారు.

◆ హోంశాఖ క్యాంపు కార్యాలయం కేజీహెచ్ డౌన్‌లోని కృష్ణానగర్‌కి రానుంది. ఇక్కడ ఉన్న జిల్లా, ప్రాంతీయ అగ్నిమాపక కార్యాలయాన్ని హోం శాఖ కోసం గుర్తించారు. ఈ భవనంలో ఒక అంతస్తు ప్రస్తుతం ఖాళీగా ఉంది.


జలవనరుల శాఖ అతిథి గృహం


ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో పరిశ్రమల శాఖ కార్యాలయం


రామ్‌నగర్‌లో వీఎంఆర్‌డీఏ షాపింగ్ కాంప్లెక్స్


సింహాచలంలో దేవదాయ శాఖ భవనం


ఎంవీపీలో వీఎంఆర్‌డీఏ నూతన భవనం

◆ పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యాలయంగా కంచరపాలెంలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌ని ఎంపిక చేశారు. 2500 చ.అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఏపీఐఐసీ జోనల్ ఆఫీస్, 2 వేల చ.అడుగుల కంచరపాలెం ఎస్టేట్‌ని వినియోగించనున్నారు.

◆ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్‌లో ఉన్న వివిధ శాఖలకు 7 భవనాలను ఎంపిక చేశారు. 27,345 చ.అడుగుల విస్తీర్ణంలో ముడసర్లోవ సమీపం దుర్గానగర్‌లో ఉన్న జీవీఎంసీ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌తో పాటు 9146 చ.అడుగుల రామ్‌నగర్ షాపింగ్ కాంప్లెక్స్, ఎంవీపీ కాలనీ సెక్టార్–12లోని 2,219 చ.అడుగుల న్యూ షాపింగ్ కాంప్లెక్స్, చినముషిడివాడలో 54,083 చ.అడుగుల విస్తీర్ణం గల వీఎంఆర్‌డీఏ కల్యాణ మండపం, పిఠాపురం కాలనీలో 24,109 చ.అడుగులున్న వీఎంఆర్‌డీఏ షాపింగ్ కాంప్లెక్స్‌ను గుర్తించారు. వీటితో పాటు వీఎంఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో ఖాళీగా ఉన్న 32,540 చ.అడుగుల విస్తీర్ణాన్ని కూడా మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌ను ఉపయోగించనున్నారు.

◆ పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ఉన్నతాధికారుల నివాస స్థలంగా కైలాసగిరి సమీపంలో 8 వేల చ.అడుగులతో ఉన్న 6 యూనిట్స్ ఉన్న గెస్ట్ హౌస్‌ను గుర్తించారు.

◆ పాఠశాల విద్య కార్యాలయంగా భీమిలిలో 2,994 చ.అడుగుల విస్తీర్ణంలో డైట్ కళాశాలలో ఉన్న భవనాన్ని ఎంపిక చేశారు.

◆ వీఎంఆర్‌డీఏ స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో ఖాళీగా ఉన్న కొంత భాగాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఇన్నోవేషన్ శాఖకు కేటాయించారు.

◆ మద్రిపాలెంలోని ఆర్ అండ్‌బీ కార్యాలయంలో ఖాళీగా ఉన్న 4 వేల చ.అడుగుల విస్తీర్ణం గల 2 ఫ్లోర్లు, గంభీరంలోని రవాణా శాఖ కార్యాలయాల్ని రవాణా శాఖ, రహదారులు,భవనాల శాఖ క్యాంపు కార్యాలయాలుగా ఎంపిక చేశారు.

◆ రుషికొండ ప్రధాన రహదారిలో ఉన్న ట్రైబల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌ను గిరిజన సంక్షేమ శాఖకు కేటాయించారు. ఈ భవనాన్ని ముఖ్యమంత్రి కార్యాలయంగా కూడా ఎంపిక చేసే అవకాశం ఉంది.

◆ రెవెన్యూ శాఖ కార్యాలయాలుగా సింహాచలంలోని దేవదాయ శాఖ భవనాలతో పాటు విజయనగరంలోని డిజాస్టర్ ట్రైనింగ్ సెంటర్‌ను ఎంపిక చేశారు.

◆ పెదవాల్తేరు ఆంధ్ర విశ్వ విద్యాలయం నార్త్ క్యాంపస్‌లో 10,300 చ.అడుగుల్లో ఉన్న ఓల్డ్ గెస్ట్ హౌస్‌ని ఆధునికీకరించి జలవనరుల శాఖ ఉన్నతాధికారుల నివాస స్థలంగా కేటాయించనున్నారు. అదే విధంగా దానికి సమీపంలో ఉన్న ఉత్తర కోస్తా చీఫ్ ఇంజినీర్ భవనంతో పాటు పెదవాల్తేరులో ఇదేశాఖకు చెందిన 37,500 చ.అడుగుల మూడంతస్తుల కొత్త భవనాన్ని కార్యాలయాలుగా గుర్తించారు. పర్యాటక శాఖ, యువజన సర్వీసుల శాఖ కార్యాలయాలుగా ఆర్‌అండ్‌బీలో మహిళా మండలి ఎదురుగా 1500 చ.అడుగులు, 3 వేల చ.అడుగుల అక్కిరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్, 7200 చ.అ. విస్తీర్ణం గల కేవీకే స్టేడియం ఆఫీస్‌ని ఎంపిక చేయగా రెసిడెన్స్‌గా బీచ్‌రోడ్డులోని హరిత రిసార్టును గుర్తించారు.

మరో 19 శాఖలకు గుర్తించే పనిలో..

వచ్చే నెలలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖకు వచ్చే అవకాశాలున్నందున ఈలోపే మిగిలిన శాఖలకు భవనాలు గుర్తించేందుకు రాష్ట్ర, జిల్లా కమిటీలు అన్వేషణ సాగిస్తున్నాయి. బీసీ సంక్షేమం, పౌర సరఫరాలు, వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ, మహిళా శిశు సంక్షేమం, ఇంధనశాఖ, ఆర్థికశాఖ, సాధారణ పరిపాలన, గ్రామ, వార్డు సచివాలయాలు, ఉన్నత విద్య, మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ, ఐటీ, కార్మిక శాఖ, న్యాయ, మైనార్టీ సంక్షేమశాఖ, ప్లానింగ్, ప్రభుత్వ రంగ సంస్థలు, సోషల్ వెల్ఫేర్, రియల్ టైమ్ గవర్నెన్స్ (ఆర్‌టీజీ), గృహ నిర్మాణ శాఖలకు సంబంధించిన భవనాలు గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ శాఖల కార్యాలయాలను కూడా సాధ్యమైనంత త్వరలో గుర్తించే పనిలో ఇప్పటికే అధికారులు నిమగ్నమయ్యారు. మొత్తంగా డిసెంబర్ నెలలో విశాఖ నుంచే ప్రభుత్వ కార్యకలాపాలు సాగించే వీలు కలగనుందని అర్థమవుతోంది.

బాల్‌బ్యాడ్మింటన్ విజేత సదరన్ రైల్వే

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా రైల్వే బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌ను సదరన్ రైల్వే జట్టు కైవసం చేసుకుంది. ఏడు జోన్ల జట్లు ఈ టోర్నీలో రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడ్డాయి. రైల్వే స్టేడియంలోని బాల్ బ్యాడ్మింటన్ కోర్టులో గురువారం జరిగిన పోరులో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జట్టు 2–0తో ఐసీఎఫ్‌పై, సౌత్ సెంట్రల్ రైల్వే 2–0తో వెస్ట్రన్ రైల్వే జట్టుపై విజయం సాధించాయి. మరో మ్యాచ్‌లో సౌత్ సెంట్రల్ రైల్వే జట్టు 2–0తో సౌత్ ఈస్టర్న్ రైల్వే జట్టు పైన విజయం సాధించింది. సదరన్ రైల్వే 2–0తో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జట్టుపై విజయం సాధించింది. దీంతో ఓవరాల్‌గా సదరన్ రైల్వే జట్టు పాయింట్ల పట్టికలో ఆధిక్యాన్ని ప్రదర్శించి విజేతగా నిలిచింది. ఐసీఎఫ్ రన్నరప్‌గా, సౌత్ సెంట్రల్ రైల్వే సెకండ్ రన్నరప్‌గా నిలిచాయి. పోటీల ముగింపు కార్యక్రమానికి డీఆర్ఎం సౌరబ్ ప్రసాద్ హాజరై విజేతలకు ట్రోఫీలు అందించారు. ఈకోర్సా వాల్తేర్ క్రీడాధికారి ప్రవీణ్‌బాటి, సలహాదారు ఎ.కె.మహారాణా, సంయుక్త క్రీడాధికారి బి.అవినాష్ పాల్గొన్నారు.

ఆల్ ఇండియా బాక్సింగ్ పోటీలకు తేజస్విని



నర్సీపట్నం:ఆల్ ఇండియా యూనివర్సిటీ స్థాయి బాక్సింగ్ పోటీలకు నర్సీపట్నానికి చెందిన యర్రా తేజస్విని ఎంపికైనట్టు బాక్సింగ్ కోచ్ అబ్బు తెలిపారు. ఈ నెల 23న ఆంధ్రా యూనివర్శిటీలో నిర్వహించిన బాక్సింగ్ పోటీల్లో యర్రా తేజస్విని ప్రథమస్థానంలో నిలినట్టు చెప్పారు.

ఇద్దరు గంజాయి నిందితుల అరెస్టు

అనకాపల్లి టౌన్: వాహనాలు తనిఖీ చేస్తుండగా స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న రెండు కేజీల గంజాయి లభ్యమైనట్లు పట్టణ క్రైం ఎస్‌ఐ సింహాచలం శుక్రవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా బురదగుట్ట గ్రామానికి చెందిన జాఫర్, కోరా గోవింద్ రైల్వే స్టేషన్ మీదుగా ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పట్టుబడ్డారు. వారి వద్ద గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

సంక్షేమ సారథి సీఎం జగన్


మాకవరంలో గ్రామస్తులతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

ముంచంగిపుట్టు: సంక్షేమ సారథి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని మాకవరం సచివాలయం పరిధిలో దొడిపుట్టు, మాకవరం పంచాయతీల్లో పలు గ్రామాల్లో శుక్రవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో 530 గడపలను ఎమ్మెల్యే సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలు తీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్‌ను పంపిణీ చేసి ప్రభుత్వ పథకాలను వివరించారు. గ్రామాల్లో గిరిజనులంతా ఎమ్మెల్యేకు పూలమాలలు వేసి బ్రహ్మరథం పట్టారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయని,గతంలో పంచాయతీ కేంద్రాలకు వెళ్లి పథకాలు పొందేవారమని, ఇప్పుడు నేరుగా ఇంటికే పథకాలు అందుతున్నాయని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు గడప వద్దకే అందుతున్నాయని, ప్రజా సంక్షేమ పాలనకు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుతున్నాయన్నారు. జగనన్న సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఎంపీపీ అరిసెల సీతమ్మ, వైస్ ఎంపీపీ భాగ్యవతి, మండల పార్టీ అధ్యక్షుడు పాంగి మల్లికార్జున్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు,సర్పంచ్‌లు గంగధర్, వసంత, మిల్కి, బాబూరావు, రమేష్, నరసింగరావు, నీలకంఠం, ఎంపీటీసీ సభ్యులు సోయిత, గణపతి, కమల, నేతలు జగబందు, జేసీఎస్ కన్వీనర్ కొండలరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఒడిశా గంజాయి స్మగ్లర్ల అరెస్ట్

- మరొకరి పరారీ
- పది కిలోల గంజాయి స్వాధీనం


పట్టుకున్న గంజాయి, నిందితులతో ఎస్‌ఐ రవీంద్ర, పోలీసులు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ లబ్బూరు జంక్షన్ వద్ద అక్రమంగా తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు ఒడిశా గంజాయి స్మగ్లర్లను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఒకరు పరారయ్యాడు. గంజాయి అక్రమ రవాణాకు ఉపయోగించిన బైకు, రూ.10 వేలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ రవీంద్ర వివరాల ప్రకారం.. పక్కా సమాచారం మేరకు లబ్బూరు జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం పోలీసులు తనిఖీలు చేస్తుండగా, బుంగాపుట్టు నుంచి ఒడిశా రాష్ట్రం వైపు వస్తున్న బైకు వదిలేసి నిందితులు పారిపోతుండగా వారిని వెంబడించి ఇద్దరిని పట్టుకున్నారు. మరొక నిందితుడు తప్పించుకున్నాడు. వారి వద్ద బ్యాగు తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. అరెస్ట్ చేసి, గంజాయిని, బైకును సీజ్ చేసి ముంచంగిపుట్టు పోలీసు స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన పది కిలోల గంజాయి విలువ రూ.10 వేలు ఉంటుందని నిర్ధారించారు. పట్టుబడిన వారిలో ఒడిశా రాష్ట్రం కొరాపుట్టు జిల్లా పొట్టంగి గ్రామ పంచాయతీకి చెందిన హిమాన్షు శేఖర్, ఇదే జిల్లా బిల్లాపుట్టు పంచాయతీ గొడిపుట్టు గ్రామానికి చెందిన మఠం సుశాంత్‌గా గుర్తించారు. ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరి జిల్లా కేంద్రానికి చెందిన దానేష్ పరారీలో ఉన్నాడని, అతడిని త్వరలోనే పట్టుకుంటామని ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. ఈ తనిఖీలో ముంచంగిపుట్టు ఏఎస్‌ఐ తిరుపతి, పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

అనకాపల్లిటౌన్: యలమంచిలి నుంచి విశాఖ వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి సుమారు 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తి శుక్రవారం మృతి చెందినట్టు దువ్వాడ జీఆర్‌పీ ఎస్‌ఐ శాంతారాం చెప్పారు. గ్యాంగ్‌మెన్ మృతదేహాన్ని చూసి స్థానిక స్టేషన్ మేనేజర్‌కు సమాచారం అందించారని, అక్కడి నుంచి అందిన సమాచారం మేరకు శారదానది రైల్వేబ్రిడ్జి వద్దకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. బ్లూకలర్ జీన్ ఫ్యాంట్, ముదురు ఆకుపచ్చ గళ్లచొక్కా మృతుడు ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు. వివరాల కోసం 7673906010 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

రైతుల్లో ఆందోళన


పాడేరులో కురుస్తున్న జల్లులు


డి.గొందూరులో పంట భూమిలో వరి పనలు

పంట కోతలను నిలిపివేసిన రైతులు

సాక్షి,పాడేరు: అల్పపీడన ప్రభావంతో జిల్లాలో గత నాలుగు రోజుల నుంచి చిరుజల్లులు కురుస్తుండంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేనందున వరి, చోడి పంట కోతలను రైతులు నిలిపివేశారు. మధ్యాహ్నం నుంచి చలిగాలులు తీవ్రత నెలకొంది. ప్రజలు ఎక్కడికక్కడ చలిమంటలను ఆశ్రయించారు.భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందనే భయంతో గిరిజన రైతులంతా వరిపంటను కాపాడుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. కోసిన వరిపనలను గట్లపైకి చేర్చడంతో పాటు పంటకోతలు లేని చోట ఆయా భూముల్లో కాల్వలు తవ్వుకున్నారు.కుప్పలకు ప్లాస్టిక్ కవర్లు,టార్పాలిన్లను రక్షణగా ఏర్పాటుచేశారు.

ఏయూలో కింగ్ సందడి



విద్యార్థులకు అభివాదం చేస్తున్న సినీ హీరో నాగార్జున


విద్యార్థుల కేరింతలు

ఏయూక్యాంపస్: ఆంధ్రయూనివర్సిటీలో కింగ్ నాగార్జున, అందాల నటుడు అఖిల్ సందడి చేశారు. ఏయూలో ఆధునికీకరించిన ఆరుబయలు రంగస్థలం–ఆస్కిన్ స్క్వేర్ పునఃప్రారంభానికి వచ్చిన అక్కినేని హీరోలకు ఘనస్వాగతం లభించింది. ముఖ్యంగా అఖిల్‌ను చూసేందుకు విద్యార్థినులు భారీగా తరలివచ్చారు. ఒక్కసారిగా అక్కినేని నటులను చూడగానే విద్యార్థినులు కేరింతలు కొట్టారు. సెల్‌ఫోన్‌తో ఫొటోలు తీశారు. వేలాదిగా విద్యార్థులు తరలిరావడంతో ప్రాంగణం నిండిపోయింది. దీంతో విద్యార్థులు జువాలజీ విభాగం భవనం మెదటి, రెండో అంతస్థులపైకి చేరుకుని అక్కడ నుంచి తమ అభిమాన నటుడుని వీక్షించారు. విద్యార్థుల అభిమానానికి కింగ్ నాగార్జున ఎంతో సంతోషానికి లోనయ్యారు. సినీ నేపథ్య గాయకుడు ధనుంజయ్ శివ సినిమాలోని బోటనీ పాఠముంది...మేటనీ ఆట వుంది అంటూ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి, రెక్టార్ ఆచార్య కె.సమత, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నుంచి.. విజయోత్సాహంతో..



విశాఖ విమానాశ్రయంలోకి వస్తున్న భారత, ఆస్ట్రేలియా క్రికెటర్లు

గోపాలపట్నం: భారత్, ఆస్ట్రేలియా జట్లు శుక్రవారం విశాఖ నుంచి తిరుగు ప్రయాణమయ్యాయి. వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియంలో గురువారం జరిగిన టీ–20 మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై భారత్ జట్టు గొప్ప విజయం సాధించిన సంగతి తెలిసిందే. రెండో టీ–20 మ్యాచ్ తిరువనంతపురంలో జరగనుంది. ఈ మ్యాచ్ కోసం శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు స్పైస్ జెట్ ప్రత్యేక విమానంలో ఇరుజట్ల సభ్యులు తిరువనంతపురం పయనమయ్యారు. వీరిని అభిమానులు, క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా వీడ్కోలు పలికారు. పలువురు అభిమానులు క్రికెటర్లతో సెల్ఫీలు దిగారు.